**188వ అధ్యాయం**

## ١٨٨ ـ بَابُ صَلاَةِ الصُّبْحِ وَالْعَصْرِ

# ఫజ్ర్, అస్ర్ నమాజుల ఘనత

١٠٤٧ ـ عن أبي موسى رضيَ اللهُ عنهُ أَنَّ رسولَ اللهِ ﷺ قالَ: «مَنْ صَلَّى البَرْدَيْنِ دَخَلَ الجَنَّةَ» متفقٌ عليه.
«البَرْدَانِ»: الصُّبْحُ وَالعَصْرُ.

1047. హజ్రత్ అబూ మూసా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: రెండు శీతల నమాజులను చేసేవాడు స్వర్గానికి వెళ్తాడు.” (బుఖారీ-ముస్లిం)

రెండు శీతల నమాజులంటే ఫజ్ర్ మరియు అస్ర్.

*(సహీహ్ బుఖారీలోని నమాజ్ వ్యవధుల ప్రకరణం- సహీహ్ ముస్లింలోని ప్రయాణీకుల నమాజ్ ప్రకరణం)*

### ముఖ్యాంశాలు

ముస్లిం అయిన వ్యక్తి ప్రతి నమాజునూ క్రమం తప్పకుండా చేయటం విధి అన్న విషయంలో ఎలాంటి సందేహానికీ తావులేదు. కాని కొన్ని నమాజుల్ని క్రమం తప్పకుండా పాటించాలంటే ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సి ఉంటుంది. అందుకే ముస్లింలు ఆయా నమాజుల విషయంలో సోమరితనానికి లోనుగాకుండా ఉండేందుకు వాటి ఘనతావిశిష్ఠతల గురించి మరింత విపులంగా వివరించటమైనది. అలాంటి నమాజుల్లో ఒకటి ఫజ్ర్ నమాజ్. ముంచుకొచ్చే నిద్రమత్తును బలవంతంగా అదుపులో పెట్టుకొని, చన్నీటితో వుజూచేసి నమాజ్ చేయటం మనసుకు చాలా కష్టంగా తోస్తుంది. అదే విధంగా అస్ర్ నమాజ్ చేయటం కూడా ఒకింత కష్టంతో కూడుకున్న పనే. ఎందుకంటే సాధారణంగా మనిషి ఆ సమయంలో వ్యాపార, వాణిజ్య కార్యకలాపాల్లో తలమునకలై ఉంటాడు. వాటన్నిటినీ విడిచిపెట్టి నమాజ్‌కు బయలుదేరాలంటే మనసుకు కష్టంగా ఉంటుంది. అందుకే హదీసులో ప్రత్యేకంగా ఈ రెండు నమాజుల ఘనతను గురించి వివరించటం జరిగింది.

١٠٤٨ ـ وعن أبي زهيرٍ عُمارَةَ بنِ رُوَيبةَ رضيَ اللهُ عنهُ قالَ: سَمِعْتُ

1048. దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచిస్తుండగా తాను విన్నానని హజ్రత్ అబూ జుహైర్ ఉమారా బిన్ రువైబా

رسولَ اللهِ ﷺ يقولُ: «لَنْ يَلِجَ النَّارَ أَحَدٌ صَلَّى قَبْلَ طُلُوعِ الشَّمْسِ وَقَبْلَ غُرُوبِهَا» يَعْنِي الفَجْرَ وَالعَصْرَ. رواه مسلم.

(రజి) తెలియజేశారు: "సూర్యోదయానికి ముందు, సూర్యాస్తమయానికి ముందు నమాజ్ చేసిన వాడెవడూ నరకానికి వెళ్ళడు." (ముస్లిం)

(సహీహ్ ముస్లింలోని ప్రార్థనా స్థలాల ప్రకరణం)

## ముఖ్యాంశాలు

మనిషి కేవలం ఆ రెండు నమాజులు పాటిస్తే నరకం నుండి సురక్షితంగా ఉంటాడని అనుకుంటే పప్పులో కాలేసినట్లే. వాస్తవానికి ఐదుపూటల నమాజులు క్రమం తప్పకుండా పాటించేవాడే నరకం నుండి సురక్షితంగా ఉండగలడు. పై హదీసులో ఫజ్ర్ మరియు అస్ర్ నమాజుల ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకొని అలా అనబడింది. ఈ రెండు నమాజుల్ని క్రమం తప్పకుండా పాటించే వ్యక్తి ఇతర నమాజుల విషయంలో కూడా నిర్లక్ష్యం వహించడని ఆశించవచ్చు. అలాంటి వ్యక్తి ఇతర విధుల్ని, అవసరమైన పనుల్ని కూడా నిర్వర్తిస్తాడు. పరలోకంలో సాఫల్యాన్ని పొందాలంటే ఇహలోకంలో వీలైనంతవరకు విధుల్ని, దైవప్రవక్త ఆచారాలను పాటించటం అవసరం.

١٠٤٩ - وعن جُنْدُبِ بنِ سُفيانَ رضيَ اللهُ عنهُ قالَ: قالَ رسولُ اللهِ ﷺ: «مَنْ صَلَّى الصُّبْحَ فَهُوَ فِي ذِمَّةِ اللهِ فَانْظُرْ يَا ابْنَ آدَمَ! لا يَطْلُبَنَّكَ اللهُ مِنْ ذِمَّتِهِ بِشَيْءٍ» رواه مسلم.

1049. హజ్రత్ జుందుబ్ బిన్ సుఫ్యాన్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: ఉదయం పూట (ఫజ్ర్) నమాజ్ చేసే వ్యక్తి దేవుని రక్షణలో ఉంటాడు. కనుక ఓ మనిషీ! తాను ఇచ్చిన రక్షణ గురించి దేవుడు నిన్ను ప్రశ్నించకుండా జాగ్రత్తపడు! (ముస్లిం)

(సహీహ్ ముస్లింలోని ప్రార్థనా స్థలాల ప్రకరణం)

## ముఖ్యాంశాలు

ఈ హదీసుకు భావం ఇది: ఓ మనిషీ! నువ్వు ఫజ్ర్ నమాజ్ విషయంలో ఏమరుపాటుకు లోనుకాకు. దేవుని పట్టుకు భయపడు- లేదా దీని భావం ఇది కూడా కావచ్చు- మనిషీ! నువ్వు దేవుని రక్షణలో ఉన్న నమాజీల జోలికి పోమాకు. వారిని ఏ విధంగానూ బాధించకు. ఒకవేళ నువ్వు వారిని బాధిస్తే దేవుడు ప్రళయదినాన నిన్ను ఈ విషయమై నిలదీసి అడుగుతాడు.

మొత్తానికి ఈ హదీసులో ఫజ్ర్ నమాజును క్రమం తప్పకుండా నెరవేర్చమని, ఆ అలవాటును కొనసాగించమని, ఆ నమాజును నెరవేర్చేవారిని కష్టపెట్టకుండా ఉండమని తాకీదు చేయబడింది.

١٠٥٠ ـ وعن أبي هُريرةَ رضيَ اللهُ عنهُ قالَ: قالَ رسولُ اللهِ ﷺ: «يَتَعَاقَبُونَ فِيكُمْ مَلائِكَةٌ بِاللَّيْلِ، وَمَلائِكَةٌ بِالنَّهارِ، وَيَجْتَمِعُونَ في صَلاةِ الصُّبْحِ وَصَلاةِ العَصْرِ، ثُمَّ يَعْرُجُ الَّذينَ بَاتُوا فِيكُمْ، فَيَسْأَلُهُمُ اللهُ ـ وَهُوَ أَعْلَمُ بِهِمْ ـ: كَيْفَ تَرَكْتُمْ عِبادِي؟ فَيَقُولُونَ: تَرَكْناهُمْ وَهُمْ يُصَلُّونَ، وَأَتَيْنَاهُمْ وَهُمْ يُصَلُّونَ» متفقٌ عليه.

1050. హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: దైవదూతలు రేయింబవళ్ళు వంతులవారీగా మీ దగ్గరికి వస్తూపోతూ ఉంటారు. ఫజ్ర్ మరియు అస్ర్ నమాజుల్లో వారందరూ కలుసుకుంటారు. ఆ తర్వాత రాత్రంతా మీతోపాటు గడిపిన దైవదూతలు తిరిగి ఆకాశం వైపు వెళ్ళినప్పుడు దేవుడు వారిని ఉద్దేశ్యించి అడుగుతాడు- "మీరు వచ్చినప్పుడు నా దాసులు ఏం చేస్తున్నారు" అని. వాస్తవానికి దేవునికి అంతా తెలిసే ఉంటుంది- దానికి దైవదూతలు, "మేము బయలు దేరినప్పుడు వారు నమాజ్ చేస్తున్నారు. అంతకు ముందు మేము వారి దగ్గరికి చేరుకున్నప్పుడు కూడా వారు నమాజ్ స్థితిలోనే ఉన్నారు" అని చెబుతారు.
(బుఖారీ-ముస్లిం)

*(సహీహ్ బుఖారీలోని నమాజ్ వ్యవధుల ప్రకరణం- సహీహ్ ముస్లింలోని ప్రార్థనా స్థలాల ప్రకరణం)*

## ముఖ్యాంశాలు

మానవుల కర్మలను వ్రాసిపెట్టే దైవదూతలు ఒకరి వెనుక మరొకరు వస్తూపోతూ ఉంటారు. రాత్రిపూట పనిచేసే దైవదూతలు అస్ర్ నమాజ్ వేళ దిగివస్తారు. అప్పుడు పగటిపూట పనిచేసే దైవదూతలు కూడా ఉంటారు. ఆ సమయంలో ఇరు బృందాలూ

కలుసుకుంటాయి. ఫజ్ర్ నమాజ్ వేళ పగటిపూట దైవదూతలు రాగానే రాత్రంతా పనిచేసిన దూతలు వెళ్ళిపోతారు. ఆ విధంగా దైవదూతలు పరస్పరం కలుసుకున్నప్పుడు మరియు వారిలోని ఒక బృందం ఇహలోకపు సమాచారం తీసుకొని దేవుని దగ్గరికి బయలుదేరు తున్నప్పుడు అదృష్టవంతులైన ముస్లింలు దైవారాధనలో, ఫజ్ర్ లేక అస్ర్ నమాజుల్లో నిమగ్నులై ఉంటారు. లోకంలో జరిగే ప్రతిదీ అల్లాహ్‌కు తెలుసు. అయితే దూతల నోటితో, తన ప్రియదాసుల ఔన్నత్యాన్ని చెప్పించాలన్న ఉద్దేశ్యంతోనే దేవుడు వారిని మానవుల గురించి అడుగుతాడు.

١٠٥١ - وعن جَرِيرِ بنِ عبدِ اللهِ البَجَلِيِّ رضيَ اللهُ عنهُ قال: كنا عِندَ النبيِّ ﷺ، فَنَظَرَ إلى القَمَرِ لَيْلَةَ البَدْرِ فقال: «إنَّكُمْ سَتَرَوْنَ رَبَّكُمْ كما تَرَوْنَ هذا القَمَرَ، لا تُضَامُونَ في رُؤْيَتِهِ، فَإنِ اسْتَطَعْتُمْ أَنْ لا تُغْلَبُوا عَلى صَلاةٍ قَبْلَ طُلُوعِ الشَّمْسِ، وَقَبْلَ غُرُوبِها فَافْعَلُوا» متفقٌ عليه. وفي روايةٍ: «فَنَظَرَ إلى القَمَرِ لَيْلَةَ أَرْبَعَ عَشْرَةَ».

1051. హజ్రత్ జరీర్ బిన్ అబ్దుల్లాహ్ బజలీ (రజి) కథనం: ఒకసారి మేము దైవప్రవక్త (సల్లం) దగ్గర కూర్చొని ఉన్నాం. అది నిండు పున్నమి రాత్రి. ఆయన చంద్రుని వంక చూసి ఇలా అన్నారు: మీరు ఏ విధంగానయితే ఈ చంద్రుణ్ణి చూస్తున్నారో అదేవిధంగా (పరలోకంలో) మీరు మీ ప్రభువుని చూస్తారు. ఆయన్ని చూడటంలో మీకెలాంటి ఇబ్బందీ ఉండదు. కనుక మీరు సూర్యోదయానికి ముందు చేయవలసిన (ఫజ్ర్) నమాజును, సూర్యాస్తమయానికి ముందు చేయ వలసిన (అస్ర్) నమాజును నెరవేర్చ టంలో అలసత్వానికి లోనుకాకుండా ఉండగలిగితే తప్పకుండా నెరవేర్చండి. (బుఖారీ-ముస్లిం)

వేరొక ఉల్లేఖనంలో "ఆయన పధ్నాలుగో తేదీ రాత్రిన చంద్రుని వంక చూశారు" అని ఉంది.

*(సహీహ్ బుఖారీలోని నమాజ్ వ్యవధుల ప్రకరణం- సహీహ్ ముస్లింలోని తౌహీద్ ప్రకరణం)*

## ముఖ్యాంశాలు

పధ్నాలుగో తేదీ రాత్రి ఉదయించే పున్నమి చంద్రుణ్ణి 'బద్ర్' అని అంటారు. 'బద్ర్' అసలు 'ముబాదరత్' అనే పదం నుండి వచ్చింది. ముబాదరత్ అంటే త్వరపడటం, వేగిర పడటం అని అర్థం. పున్నమి చంద్రుడు చాలా తొందరగా ఉదయిస్తాడు. అందుకే దానికాపేరు పడింది. పదిహేనో తేదీ నుండి చంద్రోదయం కాస్తంత జాప్యంగా జరుగుతూ ఉంటుంది.

ఈ హదీసు ద్వారా బోధపడే ముఖ్యవిషయం ఏమిటంటే-ఇహలోకంలో ఎవరూ దేవుణ్ణి దర్శించలేకపోయినా పరలోకంలో మాత్రం విశ్వాసులు ఆ భాగ్యానికి నోచుకుంటారు. ఈ హదీసు కూడా ఫజ్ర్ మరియు అస్ర్ నమాజుల్ని క్రమం తప్పకుండా నెరవేర్చాలని తాకీదు చేస్తోంది. ఆ నమాజుల ఘనతను చాటిచెబుతోంది.

١٠٥٢ - وعن بُرَيْدَةَ رضيَ اللهُ عنهُ قالَ: قالَ رسولُ اللهِ ﷺ: «مَنْ تَرَكَ صَلاةَ العَصْرِ فَقَدْ حَبِطَ عَمَلُهُ» رواه البخاري.

1052. హజ్రత్ బురైదా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం)ఈ విధంగా ప్రవచించారు: ఎవరయితే అస్ర్ నమాజును వదలిపెడతారో నిశ్చయంగా వారి సత్కర్మలన్నీ వ్యర్థమయి పోతాయి. (బుఖారీ)

*(సహీహ్ బుఖారీలోని నమాజ్ వ్యవధుల ప్రకరణం)*

## ముఖ్యాంశాలు

ఉద్దేశ్యపూర్వకంగా ఏ ఒక్క నమాజును వదలిపెట్టడమైనా ఘోరపాపమే. మరికొందరి అభిప్రాయం ప్రకారం అది కుఫ్ర్ (దైవతిరస్కారం)తో సమానం. కాని ముఖ్యంగా అస్ర్ నమాజును వదలిపెడితే మాత్రం అది ఘోరాతి ఘోర పాపమవుతుంది. దానివల్ల మనిషి చేసుకున్న సత్కర్మలన్నీ నాశనమయిపోతాయి. అంచేత అస్ర్ నమాజును పరిరక్షించుకోవటం చాలా అవసరం.